# State-Of-The-Art services in AIIMS Bibinagar

సాక్షి

# బీబీనగర్ ఎయిమ్స్‌లో అత్యాధునిక సేవలు

సాక్షి, యాదాద్రి: బీబీనగర్ ఎయిమ్స్‌లో అత్యాధునిక సూపర్ స్పెషాలిటీ వైద్యం అందుతోంది. పేద, గ్రామీణ, పట్టణప్రాంత ప్రజలు తక్కువ ఖర్చుతో వైద్య పరీక్షలు, వైద్యం పొందుతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం రంగాపూర్ వద్ద 201 ఎకరాల స్థలంలో ఎయిమ్స్ ఉంది. రూ.1,300 కోట్లతో చేపట్టిన ఎయిమ్స్ భవన సముదాయ నిర్మాణం పూర్తి కావొస్తోంది. నూతన క్యాంపస్‌లో విద్యార్థులు, వైద్యులతోపాటు రోగుల కోసం అవసరమైన భవన సముదాయాలను నిర్మిస్తున్నారు. ఈ ఏడాది చివరి నాటికి ప్రధాని మోదీ ఎయిమ్స్ నూతన క్యాంపస్‌ను ప్రారంభించే దిశగా పనులు జరుగుతున్నాయి.

## అందుబాటులో 35 రకాల వైద్య సేవలు

బీబీనగర్ ఎయిమ్స్‌లో 35 రకాల వైద్య సేవలందిస్తున్నారు. రోజూ సగటున 2 వేల మంది రోగులు వస్తున్నారు. ఆర్థోపెడిక్ విభాగంలో ప్రతిరోజు 300 వరకు ఓపీ ఉంటుంది. ఇటీవల క్లినికల్ హెమటాలజీ సూపర్ స్పెషాలిటీ వైద్యం ప్రారంభించారు. ఇందులో కేన్సర్ రోగులకు చికిత్స అందిస్తున్నారు. న్యూరో సర్జన్, హార్ట్ సర్జన్, రుమటాలజీ, డెంటల్ విభాగాలు పనిచేస్తున్నాయి. ప్రస్తుతం నాలుగు ఆపరేషన్ థియేటర్లు ఉన్నాయి. వీటిలో సగటున రోజు 20 వివిధ రకాల సర్జరీలు జరుగుతున్నాయి. అత్యాధునిక లాప్రోస్కోపిక్ సర్జరీలు చేస్తున్నారు. ఎంఆర్ఐ, సీటీస్కాన్ వంటి అత్యాధునిక పరీక్షలు చేస్తున్నారు. రోగులకు ఉచితంగా భోజన వసతి కల్పిస్తున్నారు. తక్కువ ఖర్చుతో అన్నిరకాల రోగనిర్ధారణ పరీక్షలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం 130 మంది వైద్యులు ఉన్నారు. 120 మంది సీనియర్ రెసిడెంట్ వైద్యులు. పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు చేస్తున్న 131 మంది డాక్టర్లు, 535 మంది నర్సింగ్ సిబ్బంది ఉన్నారు. వీరితోపాటు కొత్తగా ఏర్పాటు చేసే సూపర్‌స్పెషాలిటీ విభాగాల్లో 26 మంది కొత్త డాక్టర్లు, 15 మంది కొత్త ఫ్యాకల్టీని నియమిస్తున్నారు.

## క్యాంపస్ నిర్మాణాలివీ..

ఎయిమ్స్ భవన నిర్మాణ పనులను 2023, ఏప్రిల్ 8న ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. డాక్టర్ల నివాస భవనాలు, సీనియర్ వైద్యులు, ప్రొఫెసర్ల వసతి గృహాలు సిద్ధంగా ఉన్నాయి. నర్సింగ్, పరిపాలనా సిబ్బందికి రెండు టవర్లు పూర్తి కావచ్చాయి. రోగుల వెంట వచ్చే సహాయకుల కోసం నైట్ షెల్టర్, ఆస్పత్రి భవనం, అకడమిక్ బ్లాక్, ఆడిటోరియం, గెస్ట్‌హౌస్, ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్‌లు సిద్ధమవుతున్నాయి. పీజీ విద్యార్థుల కోసం నిర్మిస్తున్న భవనం మూడు నెలల్లో పూర్తి కానుంది. వైద్యులు, వైద్య విద్యార్థుల కోసం క్రీడా సేవలు, అగ్నిమాపక కేంద్రం, పోలీసు పోర్స్‌కు భవనాలు పూర్తి కావచ్చాయి.

## వినియోగంలోకి వచ్చిన 5 భవనాలు

నూతనంగా నిర్మిస్తున్న భవనాల్లో 5 భవనాలు వినియోగంలోకి వచ్చాయి. ఎంబీబీఎస్ విద్యార్థుల కోసం బాలుర హాస్టల్, 19 అంతస్తుల భవనంలో బీఎస్సీ కోర్సులు నిర్వహిస్తున్నారు. మరో 20 అంతస్తుల భవనంలో వైద్య విద్యార్థినులు, రెసిడెంట్ వైద్యులుంటారు. పక్కనే ఆయుష్ భవనం పూర్తయింది. అమృత్ నివాస్ భవనం, ఆర్థిక స్తోమత కలిగిన రోగులకు పేమెంట్ గదులు నిర్మిస్తున్నారు. అకాడమీ భవనం, వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాలలు నిర్మిస్తున్నారు.

## అదనపు ఐసీయూ పడకలు

సీ,ఎఫ్ బ్లాకులో పునర్నిర్మాణ పనులు జరగుతున్నాయి. ఇందులో 300కి పైగా అదనపు పడకలు రానున్నాయి. ఐసీయూ కోసం 70 పడకలు ఉంటాయి. ఈ బ్లాకుల్లో మరిన్ని వార్డులు, అత్యవసర సేవలు, ఇంటెన్సివ్ కేర్ యూనిట్లు, ప్రస్తుతం ఉన్న ఆరు డయాలసిస్ పడకలను 18కి పెంచుతారు. ఇందులో 16 ఆపరేషన్ థియేటర్లు వస్తాయి. మరొకటి కేన్సర్ రోగులకు చికిత్స చేసే రేడియోథెరపీ బ్లాక్ ఏర్పాటు చేస్తారు.

## రోగులకు డిజిటల్ మెడికల్ కార్డులు

ఎయిమ్స్‌లో చికిత్స పొందిన రోగుల మెడికల్ రికార్డులు కూడా డిజిటలైజ్ చేస్తున్నారు. డిజిటలైజేషన్ వల్ల రోగులకు ఆరోగ్య స్థితి సులభంగా తెలుస్తుంది. క్యూకట్టే పరిస్థితి లేకుండా సులభంగా వైద్య సేవలు పొందవచ్చు.

## పీజీ కోర్సులు

ఎయిమ్స్ వైద్య విద్యలో సూపర్ స్పెషాలిటీ కోర్సులను ఈ సంవత్సరం ప్రారంభిస్తున్నారు. డెర్మటాలజీ, బ్లడ్ బ్యాంక్, రేడియో థెరపీ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, ఫిజికల్ మెడికల్ రీహాబిలిటేషన్ కోర్సుల పీహెచ్‌డీ విద్యను అందిస్తున్నారు. టెక్నికల్ కోర్సుల్లో సీటీ స్కాన్, హెల్త్ ఇన్ఫర్మేటిక్ (డిజిటల్ హెల్త్) ఎంఆర్ఐ వంటివి ఉన్నాయి. నర్సింగ్ కోర్సును ప్రారంభించారు.

## 21 నుంచి ఎల్లో ఫీవర్ టీకా..

విదేశాలకు వెళ్లే వారికి తప్పనిసరైన ఎల్లో ఫీవర్ నివారణ టీకా ఈనెల 21 నుంచి ఇవ్వనున్నారు. అలాగే ఐదేళ్లలోపు పిల్లలకు అత్యవసర వైద్యం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం పీడియాట్రిక్ క్రిటికల్ కేర్ యూనిట్‌ను సిద్ధం చేస్తున్నారు. దోమ కాటు వల్ల ఎల్లో ఫీవర్ వస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆదేశాల మేరకు 42 దేశాలు ఎల్లో ఫీవర్ టీకాను తప్పనిసరి చేశాయి. టీకా వేసుకున్నట్లు సర్టిఫికెట్ ఉంటేనే విదేశీయులను అనుమతిస్తాయి. ప్రధానంగా ఆఫ్రికా, గల్ఫ్ దేశాల్లో ఈ వ్యాధి ఎక్కువగా సోకుతుంది. ఎల్లో టీకా ఇచ్చేందుకు ఎయిమ్స్‌లో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. దీనికి కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ఈ కేంద్రం ఈనెల 21వ తేదీ నుంచి అందుబాటులోకి రానుంది. కేవలం రూ.300కే ఎల్లో ఫీవర్ టీకా ఎయిమ్స్‌లో ఇస్తారు. టీకా తీసుకోకుండా ఆయా దేశాలకు వెళ్లినట్లయితే అక్కడ విమానాశ్రయాల్లో వారం రోజులు క్వారంటైన్ చేస్తారు.

ఎయిమ్స్ ఓపీ వద్ద క్యూకట్టిన రోగులు

### పేదలకు చేరువగా ఖరీదైన వైద్యం

- సీటీ స్కాన్, ఎంఆర్ఐ పరీక్షలు అందుబాటులో..
- రోగులకు డిజిటల్ మెడికల్ కార్డులు
- ఈ ఏడాది చివరి నాటికి పూర్తి స్థాయి వైద్యం
- ఎయిమ్స్‌లో వైద్యవిద్యతో పాటు పరిశోధనలు

సీటీ స్కాన్ యంత్రాన్ని పరిశీలిస్తున్న డైరక్టర్ వికాస్ భాటియా

### అత్యాధునిక వైద్యం అందిస్తాం..

బీబీనగర్ ఎయిమ్స్‌లో రోగులకు మెరుగైన అత్యాధునిక వైద్యం అందిస్తాం. ఇందుకోసం మూడు విభాగాల మీద దృష్టి సారించాం. మెడికల్ విద్య, ఆస్పత్రిలో వైద్యసేవలు, రోగుల సంరక్షణ, వివిధ రకాల పరిశోధనలతో నిపుణులైన డాక్టర్లు, నర్సులు టెక్నీషియన్ల వంటి సాంకేతిక నిపుణులను తయారు చేస్తున్నాం. 2025-26 సంవత్సరంలో ఎయిమ్స్‌లో పూర్తి స్థాయి వైద్యం అందిస్తాం. తెలంగాణ, ఏపీ నుంచి రోగులు ఎయిమ్స్‌కు వచ్చి సేవలు పొందుతున్నారు.

– డాక్టర్ వికాస్ భాటియా, ఎయిమ్స్ డైరెక్టర్